క్లుప్తంగా

అధ్వానంగా పిల్లల పార్కులు

మణుగూరుటౌన్: పచ్చని ప్రకృతి, రంగు రంగుల బొమ్మలు, విశాలమైన ఆట స్థలం, రకరకాల ఆట వస్తువులతో కళకళలాడాల్సిన పీవీ కాలనీలోని పిల్లల పార్కులు యాజమాన్యం పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరాయని వాటిని టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి ఆరోపించారు. ఆదివారం ఆయన కార్మికులు నివాసం ఉండే పీవీకాలనీలోని బాంబేకాలనీ, కమ్యూనిటీహాల్ వద్ద అన్ని పార్కులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఏరియాలో లాభాలపై ఉన్న శ్రద్ధ కార్మిక సంక్షేమంపై యాజమాన్యానికి లేదని ఆరోపించారు. కోట్లాది రూపాయల లాభాలు ప్రతి ఏటా సంపాదించి పెట్టే కార్మికులు వారి పిల్లలకు పార్కుల ద్వారా మెరుగైన సౌకర్యాలు కల్పించే బాధ్యత మరిచిందన్నారు. వెంటనే మరమ్మతులు చేపించి పిల్లలకు ఆహ్లాదాన్ని పంచే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రూ.2.10 లక్షల నిత్యావసరాలు అందజేత



పాఠశాలలో నిత్యావసరాలు అందజేస్తున్న దాతలు

మణుగూరురూరల్: మండలంలోని సంతోష్‌నగర్‌లోని శ్రీవిద్యాభ్యాస ఎడ్యుకేషన్ చారిటీ ట్రస్ట్ (పూర్వ బాలవెలుగు పాఠశాల)కు శ్రీనివాస మునుస్వామి రాధా అర్ధంకి రూ.2.10లక్షల విలువ చేసే రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. భవిష్యత్తులో కూడా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ శరత్, సభ్యులు వెంకటేశ్వర్లు, ఉల్లెందుల సురేష్, సీపీఐ పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, జంపాల శ్రీనివాస్, పాఠశాల నిర్వాహకులు జగన్మోహన్‌రెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

హైడ్రా కొరడా అభినందనీయం

అశ్వాపురం: సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు హైడ్రా కమీషనర్ ఏవీ.రంగనాథ్ ఆధ్వర్యంలో అక్రమ కట్టడాలపై చర్యలు అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య అన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హైడ్రాను గ్రేటర్ హైదరాబాద్‌లోనే కాకుండా రాష్ట్రంలో అన్ని ప్రధాన నగరాలకు మండల, జిల్లా కేంద్రాలకు విస్తరింపజేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్, ప్రత్యేక అధికారిని నియమించి రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకొని అక్రమ కట్టడాలు నిర్మించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కట్టడాలు కూల్చి ప్రభుత్వం స్వాధీనం పరుచుకొని ప్రజా అవసరాలకు వినియోగించాలన్నారు.

మౌనదీక్షలో మున్నూరు కాపులు

దుమ్ముగూడెం: ఏజెన్సీ ప్రాంత మున్నూరు కాపులకు అధికారులు ఎటువంటి షరతులు ఇబ్బందులు గురి చేయకుండా కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడు పూదోట సూరిబాబు డిమాండ్ చేశారు. మున్నూరు కాపు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం దుమ్ముగూడెం గ్రామంలోని గాంధీ విగ్రహం వద్ద పది నిమిషాల పాటు మౌన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 23 శాతం ఉన్న మున్నూరు కాపుల సంక్షేమం కోసం కాపు కార్పొరేషన్ ద్వారా ప్రతి ఏటా బడ్జెట్‌లో మూడు వేల కోట్ల రూపాయలు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం మండల నాయకులు పత్తివాడ జగదీష్,కొండపల్లి నరేంద్ర, బైరెడ్డి సతీష్, కెల్లా శేఖర్, అల్లాడి వెంకటేశ్వరరావు, లంక ప్రసాద్, కెల్లా శ్రీరాములు, పిల్ల సాయిబాబు, యాసాల ముత్యాలరావు, బైరెడ్డి అరవింద్, బండి సత్యనారాయణ, పిల్లా శివ, రాజేష్ పాల్గొన్నారు.

ఉచిత ఆరోగ్య పరీక్షలు

అశ్వారావుపేటరూరల్: కామన్ హెల్త్ సెంటర్ (సీఎస్‌సీ), వెల్‌నెస్ సర్వీసెస్ ఆధ్వర్యంలో కార్మిక కుటుంబాలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఆదివారం అశ్వారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాల ఆవరణలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 156 మంది కార్మిక కుటుంబాల సభ్యులకు 56 రకాల ఆరోగ్య నిర్ధారణ పరీక్షలు చేశారు. అలాగే దీర్ఘకాలిక వ్యాధులతో 17 మంది కార్మికులు బాధపడుతున్నట్లు గుర్తించి మెరుగైన వైద్య సేవల కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికు రిఫర్ చేసినట్లు సీఎస్‌సీ హెల్త్ కేర్ జిల్లా కోఆర్డినేటర్ షేక్ అక్బర్ అలీ చెప్పారు. క్యాంప్ కోఆర్డినేటర్ జి.మహేష్, సిబ్బంది సాగర్, ప్రసన్న, దుర్గా, రాణి, అంజలీ, పావని, లావణ్య, బాబీ, నాగరాజు పాల్గొన్నారు.

పైన మినరల్.. లోన జనరల్!

- మినరల్ వాటర్ పేరిట నకిలీ విక్రయాలు
- ఒకే బ్రాండ్ పేరుతో అక్షరాలు మార్చి బురిడీ
- నాణ్యతా ప్రమాణాలకు పాతర



బిస్‌లరీ కంపెనీని పోలిన డూప్లికేట్ వాటర్ బాటిళ్లు..



ఒరిజినల్ బిస్‌లరీ కంపెనీ బాటిళ్లు..

భద్రాచలంఅర్బన్: భద్రాచలంతో పాటు జిల్లా వ్యాప్తంగా నకిలీ మినరల్ వాటర్ బాటిళ్ల దందా మూడు పువ్వులు ఆరు కాయ లుగా విరాజిల్లుతోంది. భద్రాచలంలో టెంపుల్ ఏరియా, బస్టాండ్, ప్రైవేట్ ఆస్పత్రులతో పాటు జిల్లా వివిధ ప్రాంతాల జనాలు ఎక్కువగా ఉండే రద్దీ ప్రాంతాల్లో వీరు తమ దందా సాగిస్తున్నారు. ఒరిజినల్ బ్రాండ్ల రంగుల్లో కేవలం బ్రాండ్ పేరులోని ఒక్క అక్షరాన్ని మార్చేస్తూ జనాన్ని బురిడీ కొట్టిస్తున్నారు. చాలా మంది విషయం తెలియక అసలైందే అనుకొని ఆ నీటిని తాగేస్తున్నారు. సంబంధిత అధికారులు తనిఖీ చేసిన దాఖలాలు లేవు.

భద్రాచలం పట్టణంతో పాటు జిల్లా వ్యాప్తంగా మూడు ప్రముఖ సంస్థలు బిస్‌లరీ, కిన్లే, ఆక్వాఫినా మినరల్ బాటిల్స్ అధిక శాతం అమ్మకాలు జరుగుతుండగా.. ప్రస్తుతం పట్టణంలో రాయల్‌శ్రీ, బెయిల్‌శ్రీ, బినేరీతో పాటు ఇతర పేర్లతో బ్రాండ్లు వాడకంలోకి వచ్చాయి. పేర్లలోని అక్షరాలను మారుస్తూ ఒరిజినల్లకు ఏమాత్రం తీసిపోకుండా ప్యాకింగ్ చేసి అమ్ముతూ జేబులు నింపుకుంటున్నారు. గతంలో ఇదే విధంగా కిన్లే సంస్థ అమ్మకాలు జరిపే బాటిల్‌ను పోలిన విధంగా కొన్ని ఫేక్ కంపెనీల నిర్వాహకులు జోరుగా అమ్మకాలు జరిపేవారు. కాగా ఇప్పుడు సదరు కిన్లే సంస్థ ఆ వాటర్ బాటిల్ ప్రతిరూపాన్నే మార్చేసింది. దీంతో ఇప్పుడు కన్ను బిస్‌లరీ కంపెనీపై పడింది. పేరు, బాటిల్ ప్రతిరూపం బిస్‌లరిలా ఉండే విధంగా తయారు చేసి, మార్కెట్‌లోకి వదిలారు. వీటిని కొనుగోలు చేసే ప్రజలు సైతం అసలు బిస్‌లరీ సంస్థను నమ్మడం మానేసి, ఫేక్ బ్రాండ్లనే ఒరిజినల్ బ్రాండ్లుగా నమ్ముతున్నారు.

ఫేక్ కంపెనీలు సురక్షితమా..?

కాగా.. ఫేక్ బ్రాండ్లతో వస్తున్న బాటిళ్ల నాణ్యతపై నీలినీడలు కమ్ముకున్నాయి. వారు నీటిని శుద్ధి చేసే అమ్ముతున్నారా లేదా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.

సాధారణ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకుని దాని ద్వారా ఫేక్ కంపెనీ ప్యాకింగ్‌లు చేసుకొని మార్కెట్లోకి తెస్తున్నట్లు తెలుస్తుంది. వారు నిర్వహించే ప్లాంట్లు ఎక్కుడ ఉన్నాయి? అవి నిబంధనల మేరకే నడుస్తున్నాయా? ప్రభుత్వం నుంచి అనుమతి పత్రాలు ఉన్నాయా? అన్న విషయాలను ఆర్‌డబ్ల్యూఎస్, ఆహార కల్తీ నిరోధకశాఖ, ఫుడ్ కంట్రోలర్ అధికారులు, పంచాయతీ శాఖ సంబంధిత అధికారులు నిగ్గు తేల్చాల్సి ఉంది.

అధికారులకు పట్టదా?



భద్రాచలం పట్టణంలో ఎటు చూసినా డూప్లికేట్ మినరల్ బాటిళ్ల దందా సాగుతోంది. నాణ్యతా ప్రమాణాల గురించి అడిగితే ఇష్టముంటే కొను లేకపోతే వదిలేయండి అంటూ జవాబు చెబుతున్నారు. ఇలాంటి నీటిని తాగితే అనారోగ్య సమస్యలు తప్పవని వైద్యులు చెబుతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదు.

– ప్రశాంత్ కుమార్, భద్రాచలం

నిర్వాహకులపై చర్యలు తప్పవు...



నకిలీ వాటర్ బాటిళ్ల విక్రయాలపై చర్యలు తీసుకుంటాం. భద్రాచలం పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్‌లలో తనిఖీలు నిర్వహిస్తాం. ప్రజల ఆరోగ్యంతో చలగాటం ఆడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

– కిరణ్ కుమార్, జిల్లా ఆహార కల్తీ నిరోధకశాఖ అధికారి

హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలి



నినాదాలు చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

మణుగూరురూరల్: సంక్షేమ హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి జె.గణేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మణుగూరు పట్టణంలోని వివిధ సంక్షేమ హాస్టళ్లను ఆయన సందర్శించి నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారిన విద్యారంగం పట్ల ప్రభుత్వాలు తీరు మారడం లేదని అన్నారు. విద్యనభ్యసించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆదివాసీ, దళిత, బీసీ, మైనార్టీ నిరుపేద విద్యార్థులకు హాస్టళ్లలో సమస్యలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోగా... వారికి కాస్మోటిక్స్ అందించడం లేదని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచడం లేదని విమర్శించారు. అధ్వాన్న భరితంగా ఉన్న హాస్టళ్ల మరమ్మతులూ అలానే ఉన్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సంక్షేమ హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ప్రమీల, సరోజిని, అరవింద్, జి.వినోద్, భానుప్రసాద్, కార్తీక్, పూజిత, పావని తదితరులు పాల్గొన్నారు.

తాలిపేరు పనులు పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ఎలమంచి వంశీకృష్ణ

చర్ల: ఏజెన్సీ ప్రాంత రైతాంగానికి ప్రధాన కల్పతరువుతుగా ఉన్నటువంటి తాలిపేరు మధ్యతరహా సాగునీటిప్రాజెక్టుకు చేపట్టిన మెయింటినెన్స్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ఆయకట్టు పరిధిలోని రైతాంగానికి పూర్తి స్థాయిలో సాగునీటిని విడుదల చేయాలని ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలమంచి వంశీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం చర్లలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాలిపేరు ప్రాజెక్టుకు దశాబ్దాల కాలం క్రితం చేపట్టిన మెయింటినెన్స్ పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని ఈ క్రమంలో చేపట్టిన అదనపు గేట్ల నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయిందని ఆయన అన్నారు. పూర్తి స్థాయిలో మెయింటినెన్స్ పనులు పూర్తి కాకపోవడంతో ఏటా రబీలో 12 వేల ఎకరాలకు అందాల్సిన సాగు నీరు కనీసం 8 వేల ఎకరాలకు కూడా అందడం లేదని ఆయన అన్నారు. ప్రాజెక్టు కాలువలను పర్యవేక్షించేందుకు సరిపడా సిబ్బంది కూడా లేకపోవడంతో ఉన్న సిబ్బందికి పనిభారం పెరగడంతో పాటు పూర్తి స్థాయి పర్యవేక్షణ లేకుండా పోతోందని ఆయన అన్నారు. తక్షణమే తాలిపేరు ప్రాజెక్టుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించి అభివృద్ధి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు మచ్చా రామారావు, సోంది నారాయణ, నరేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పని కోసం ఆలోచన అదిరింది!



మిషన్ లిఫ్ట్‌పై నిలబడి పనులు చేస్తున్న యువకుడు

కరకగూడెం: ఒక ఆలోచన మనుషులను ఏ స్థాయిలో అయినా ఉంచుతుంది.ఏ పని చేయాలన్న ఆలోచించి మంచి ఆలోచనలతో చేస్తే అనుకూలంగా ఫలితాలు రావడంతో సమయం కూడా ఆదా అవుతుంది. ఈ క్రమంలో ఆదివారం కరకగూడెం మండల కేంద్రంలో విద్యుత్ మరమ్మతులు చేస్తున్న సిబ్బంది విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేయాల్సి ఉండగా అక్కడే ఉన్న వారి 'ఆగర్ యంత్ర లిఫ్ట్' సాయంతో స్తంభం దగ్గర ఎత్తుగా నిలబడి పనులను చకచకా పూర్తి చేసి ఔరా అనిపించారు. ఈ సందర్భంగా అవసరానికో ఓ ఆలోచన వారిని ముందుకు నడిపించిందని స్థానికులు చర్చించుకున్నారు. కాగా పనుల దృశ్యాలను 'సాక్షి'తన కెమెరాలో బంధించింది.

ఖాళీ బాటిళ్లే.. హెచ్చరిక సూచిక!



గొయ్యి దగ్గర కర్రలకు హెచ్చరికగా పెట్టిన ప్లాస్టిక్ బాటిళ్లు

అశ్వారావుపేటరూరల్: వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఓ ప్రధాన రహదారిలో కోతకు గురై పడిన గొయ్యి ప్రమాదకరంగా ఉంది. అశ్వారావుపేట మండలం ఆసుపాక–నారాయణపురం రహదారి మధ్యలో ఉన్న వంతెన వద్ద గత నెల 18వ తేదీ కురిసిన భారీ వర్షం వరదనీటితో కోతకు గురై భారీ గుంత ఏర్పడింది. ఈ మార్గం గుండా రాకపోకలు సాగించే వాహనదారులకు దగ్గరకు వచ్చేదాకా గొయ్యి కనిపించడం లేదు. అధికారులు కనీసం హెచ్చరిక సూచన కుడా పెట్టకపోవడతో స్థానికులే ప్రమాదాలు జరగకుండా కర్రలు పెట్టి వాటికి ప్లాస్టిక్ బాటిళ్లను తొడిగారు. దీంతో ఖాళీ బాటిళ్లే హెచ్చరిక సూచికగా మారాయి. ఈ దృశ్యాన్ని ఆదివారం 'సాక్షి'కెమెరాలో క్లిక్ మనిపించింది.

రేపు దివ్యాంగ బాలలకు అలింకో శిబిరం

దుమ్ముగూడెం: మండలంలోని దివ్యాంగ బాలలు ఈ నెల 27వ తేదీన కొత్తగూడెంలోని ఆనందకని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జరిగే అలింకో క్యాంపునను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ సున్నం సమ్మయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాల లోపు దివ్యాంగులైన విద్యార్థులు హాజరుకావాలని సూచించారు. ఎంపికచేసిన విద్యార్థులకు అలింకో కంపెనీ వారు పరికరాలు, ఉపకరణాలు అందజేస్తారని తెలిపారు. మరింత సమాచారం కోసం నంబర్లు 7981104457, 9963280621 సంప్రదించాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు సతీష్, రాగిణి లు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని పరివర్తన యశోద ఫౌండేషన్ సేవాసమితి ఆధ్వర్యంలో సేవాసమితి కార్యాలయం ఆవరణలో వికలాంగులకు, వృద్ధులకు ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరివర్తన యశోద ఫౌండేషన్ సేవా సమితి అధ్యక్షులు కోమగిరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మానసిక వికలాంగులకు, వృద్ధులు, వితంతువులకు ప్రభుత్వం పింఛన్ పెంచాలని డిమాండ్ చేశారు. డాక్టర్ భాను ప్రసాద్, ఈటె రాజేశ్వరరావు డాక్టర్ రాయుడు, మేకల లత, లంక యుగంధర్ రావు, అప్పన్న దాసు బాబు, భూక్య కిషన్, బొక్క పున్నమయ్య, బర్ల జాన్ కుమార్, మారం ఈశ్వర్ రెడ్డి, కోట ప్రభాకర్ రావు, కనుక వెంకటేశ్వర్లు, విష్ణు, భూకే శిల్ప, తలపాల అప్పారావు, కంభంపాటి రాజా తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో నూతనోత్తేజం

మణుగూరుటౌన్: కరాటే అభ్యసించడం ద్వారా పిల్లలు స్వీయ రక్షణతో పాటు శారీరక ధృడత్వంతో నూతనోత్తేజంగా ఉంటారని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ అన్నారు. ఆదివారం పీవీకాలనీలో కోదండరామాలయం వద్ద జరిగిన కరాటే పోటీలకు ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ వై.రాంగోపాల్ అభ్యర్థన మేరకు అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. అనంతరం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధికారులు వెంకటేశ్వర్లు, సలగల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

31న మహాసభలు

చంద్రుగొండ: ఈనెల 31న హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల నాయకుడు వరికూటి వెంకట్రావ్ పిలుపునిచ్చారు. ఈమేరకు మహిళలు ఆదివారం మండలకేంద్రంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలపై ఇటీవల కాలంలో జరుగుతున్న దాడులను ఖండించారు. రోజా, కుమారి, భద్రమ్మ, రమణ, లక్ష్మి, రాజమ్మ పాల్గొన్నారు.

ధర్మ పరిరక్షణే ధ్యేయం..

ములకలపల్లి: ధర్మోరక్షతి రక్షతహః సిద్ధాంతంతో ఆవిర్భవించిన విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) సనాతన ధర్మ పరిరక్షణే ధ్యేయంగా ముందుకు సాగుతోందని సంఘ ప్రముఖులు నెట్టెం రామకృష్ణ, శ్రీమంతుల పార్వతమ్మ అన్నారు. వీహెచ్‌పీ ఆవిర్భవించి 60 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆదివారం మండలకేంద్రంలోని శిశుమందిర్ ఆవాస విద్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ములకలపల్లి ప్రఖండ అధ్యక్షుడు డాక్టర్ కేపీ.సత్యనారాయణరాజు. ఉపాధ్యక్షుడు పువ్వాల శ్రీనివాస్, పద్దం బుజ్జి. శనగపాటి రవి. జిల్లా సామరస్యతా ప్రముఖ్ గొడ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం



అన్నపురెడ్డిపల్లి: కళాశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అన్నపురెడ్డిపల్లి: నియోజకవర్గంలో ప్రజలకు విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తానని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బాలాజీ వేంకటేశ్వర స్వామి వారి సత్రంలో ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిబా పూలే కళాశాలను ఆయన ప్రారంభించారు. కళాశాల తరగతి గదులను, విద్యార్థి వసతి సదుపాయాలను పరిశీలించి, కళాశాల వివరాలను స్పెషల్ ఆఫీసర్ బురాన్‌ను అడిగి తెలుసుకున్నారు.కళాశాల ప్రాంగణంలో జ్యోతి ప్రజ్వలన చేసి, అనంతరం ఆయన మాట్లాడారు. అన్నపురెడ్డిపల్లి మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అన్నపురెడ్డిపల్లిలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయటానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. తొలిత శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థప్రసాదాలను ఆయనకు అందజేశారు. శివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఎంపీడీఓ మహాలక్ష్మి, ఆలయ మేనేజర్ రమణ, ఎస్సై చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వనమా గాంధీ, వేముల రమణ, పర్సా వేంకటేశ్వర్లు, నకరికంటి వేంకటేశ్వరరావు, లక్ష్మారెడ్డి, దుబ్బాకుల రాము, లాలయ్య, వేముల నరేష్ పాల్గొన్నారు.

త్వరితగతిన పూర్తి చేయాలి

ములకలపల్లి: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్) భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అధికారులను ఆదేశించారు. మండలపరిధిలోని మూకమామిడి ప్రాజెక్ట్ సమీపంలో నిర్మిస్తున్న ఏకలవ్య భవంతులను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. వీలైనంత త్వరగా పనులు పూర్తిచేసి, ఈ వార్షిక సంవత్సరంలోనే విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, గాడి తరుపతిరెడ్డి, తమ్మిశెట్టి శ్రీను తదితరులు ఉన్నారు.

చర్లలో ముమ్మరంగా తనిఖీలు

చర్ల: మండలంలో ఆదివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రమైన చర్లలో ఆదివారం నిర్వహించే వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుకుమా, దంతెవాడ జిలాల్లాల నుంచి పెద్ద ఎత్తున ఆదివాసాలు తరలివస్తుండగా వారి మాటున మావోయిస్టులు, మిలిటుంట్లు, మిలీషియా సభ్యులు, కొరియర్లు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలను చేపట్టారు. తనిఖీల్లో బాగంగా చర్లకు వచ్చే ప్రధాన రహదారులైన లెనిన్ కాలనీ, తాలిపేరు ప్రాజెక్టు, కలివేరు క్రాస్‌రోడ్, ఆర్ కొత్తగూడెం తదితర ప్రాంతాలలో మోహరించిన పోలీసు బలగాలు వచ్చిపోయే ఆదివాసీలను నిశితంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనుమానితులుగా భావిస్తూ పలువురు ఆదివాసీలను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించి విడిచిపెట్టారు. సీఐ ఏ రాజువర్మ ఆదేశాల మేరకు ఎస్సై నర్సిరెడ్డి తనిఖీలను చేపట్టారు.

ఈ తనిఖీలలో సివిల్, స్పెషల్ పార్టీ, సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

ఏఐకేఎస్ నూతన కమిటీ ఎన్నిక

చర్ల: ఏఐకేఎస్ చర్ల మండల మహాసభ ఆదివారం చర్ల మండల కేంద్రంలోని బీఎస్ రామయ్యభవన్‌లో జరిగింది. ఈ మహాసభలో మండల అధ్యక్ష, కార్యదర్శులతో పాటు 14 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగాలు సోంది నారాయణ, మచ్చా రామారావులతో పాటు 14 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని చెప్పారు. తమపై నమ్మకంతో ఈ కమిటీకి ఎంపిక చేసిన వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తామని తమను ఎంపిక చేసినవారందరికీ కృతజ్ఞతలను తెలియజేస్తున్నట్లు వారు ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు వర్మ, శ్యామల వెంకటేశవర్లు, నర్సింహారావు, సోడి శ్రీరాములు, సోడి బాబూరావు, కుర్సం శ్రీను, పాయం వెంకటేశ్వర్లు, ఉయిక శ్రీనివాస్ ఉయిక రాము తరలితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిధుల సేకరణ



వ్యాపారుల నుంచి విరాళం సేకరిస్తున్న సీపీఎం శ్రేణులు

దుమ్ముగూడెం: మండల సీపీఎం ఆధ్వర్యంలో లక్ష్మీనగరం గ్రామంలో కేరళ వయనాడు వరద బాధితులకు ఆర్థిక సహాయార్థం నిధుల సేకరణ క్యాంపెయిన్ ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య మాట్లాడుతూ... కేరళ రాష్ట్రంలో భారీ వరదలు కారణంగా వయనాడులో కొండలు విరిగి అనేకమంది పేద ప్రజలు మరణించడం జరిగిందని, ఆ వరద బాధితులకు సహకరించిన లక్ష్మీనగరం వ్యాపారస్తులకు చిరు వ్యాపారస్తులందరికీ ధన్యవాదాలని అన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ, లక్ష్మీనగరం మాజీ సర్పంచ్ సరియం రాజమ్మ, నాయకులు యలమంచి శ్రీనుబాబు, మహమ్మద్ బేగ్, మాజీ ఉపసర్పంచ్ గుడ్ల రామ్మోహన్ రెడ్డి, జి.తాతారావు, మద్ది శ్రీనివాస్ రెడ్డి, డింగి గురుమూర్తి, శీరపు శివ కాంత్ రెడ్డి పాల్గొన్నారు.

బోధనేతర సిబ్బంది సమస్యలు పట్టించుకోవాలి

కరకగూడెం: కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ సమస్యలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు ఆర్.మధుసూదన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బేసిక్ పే అమలుకై, జీతాల పెంపుదలకై ఈ నెల 30న తలపెట్టిన 'చలో హైదరాబాద్ ఎస్పీడీ కార్యాలయం'కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ.. మండల పరిధిలోని భట్టుపల్లి కేజీబీవీ పాఠశాలలో వర్కర్లతో కరపత్రాలను ఆవిష్కరించారు. మాట్లాడుతూ..కేజీబీవీలలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్లకు కనీస వేతనాలు అమలు కావడం లేదని, పేరు గొప్ప జీవితం దిబ్బగా వారి పరిస్థితి ఉందని అసహనం వ్యక్తం చేశారు. అంతే కాకుండా రాష్ట్ర ప్రభుత్వ కనీస వేతనాల జీవో ప్రకారం రూ.18 వేల నుంచి 28 వేల పైగా రూపాయలు కేజీబీవీ సిబ్బందికి చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రంలో ఇతర గురుకులాల్లో పనిచేస్తున్న సిబ్బందికి చెల్లిస్తున్న మాదిరిగా కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బంది చెల్లించాలన్నారు. పని భారం తగ్గించాలని, ఖాళీ అయిన స్థానాల్లో సిబ్బందిని తక్షణమే నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శెట్టిపెల్లి నాగేశ్వరరావు, కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుకు చేరుకున్న మెషినరీ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని మనుబోతుల చెరువు వద్ద గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రూ.80 లక్షల వ్యయంతో నిర్మాణం చేపడుతున్న డంపింగ్ యార్డులో రూ.35లక్షలతో డీఆర్‌సీసీ షెడ్ల నిర్మాణం ఇప్పటికే పూర్తి అయింది. ఇందుకు సంబంధించిన మెషినరీ అందుబాటులోకి వచ్చాయి. దీనిలో తడి చెత్తకు సంబంధించి వెట్ వేస్ట్ మెషిన్‌ను గ్రామ పంచాయతీ ఇప్పటికే కొనుగోలు చేయగా, ఆదివారం పొడి చెత్తకు సంబంధించిన (బెయిలింగ్ మెషిన్) ఐటీసీ కంపెనీ సమకూర్చింది. అంతే కాకుండా తడి చెత్తకు సంబంధించి మరో మెషినరీ, అదే విధంగా పొడి చెత్తకు సంబంధించి మరో రెండు మెషినరీలు ఇంకా రావాల్సింది ఉంది.. కాగా డంపింగ్ యార్డు నిర్మాణం పూర్తి అయ్యి వినియోగంలోకి వస్తే ఇటు గ్రామ పంచాయతీకి ఆదాయంతో పాటు స్థానికులకు ఉద్యోగాలు కూడా లభించనున్నాయి. భద్రాచలం గ్రామ పంచాయతీ ఈఓ శ్రీనివాసరావును వివరణ కోరగా మరో నెల రోజుల్లో పెండింగ్ లో ఉన్న పనులు పూర్తి అయ్యే అవకాశం ఉందని తెలిపారు.

గ్రామదేవతలకు బోనాలు



బూర్గంపాడు: నాగినేనిప్రోలులో బోనాలతో వెళ్తున్న మహిళలు

బూర్గంపాడు: గ్రామదేవత ముత్యాలమ్మకు ఆదివారం ఘనంగా బోనాలు సమర్పించారు. అన్ని గ్రామాల్లో ముత్యాలమ్మ తల్లికి గ్రామస్తులు, మహిళలు మేళాతాళాలతో ఊరేగింపుగా వెళ్లి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



చంద్రుగొండ: పాకలగూడెంలో పెద్దమ్మతల్లికి బోనాలు సమర్పించేందుకు కదంతొక్కిన మహిళలు

చంద్రుగొండ: మండలంలోని పోకలగూడెం, బారికుంట గ్రామాల్లో ఆదివారం బోనాల సందడి నెలకొంది. గ్రామ దేవతలైన ముత్యాలమ్మ, మైసమ్మ, పెద్దమతల్లి దేవతలకు మహిళలకు భక్తి, శ్రద్ధలతో బోనాలు సమర్పించారు.